

రామనాథం కాలుగాలిన పిల్లిలా అటూ యిటూ తిరుగుతున్నాడు అతని మనస్సు నిలకడగా లేదు దీపంలో పడ్డ మిడతలా ఆందోళనతో కొట్టుమిట్టాడుతున్నాడు ఇంత రాత్రయినా లీల ఇంటికి చేరుకోకపోవటం చాలా విచిత్రంగా వుంది ఇంతకు ముందెపుడు ఇలా జరగలేదు మరి ఇవాళ యింత ఆలస్యమైనా రాకపోవటానికి కారణం ఏమిటి?

పచార్లు చెయ్యటం మినహా మరేమీ చెయ్యలేక పోతున్నాడు రామనాథం ఎంత నిభాయించుకొందామన్నా, మనసు కలవరపాటుకు లోనవుతూనే వుంది

కాలేజీలో ఏదేనా ఫంక్షన్ వుందేమో అందుచేత ఆలస్యం అయి వుండవచ్చు ఈ ఆలోచన వచ్చినా మనోనిబ్బరం కలగలేదు అతనికి 'కాలేజీలో ఏదేనా ఫంక్షన్ వుంటే లీల ముందుగా తనతో ఆ విషయం అనివుండేది ఆఖరుకు దేవాలయానికి వెళ్లినా ఇంట్లో చెప్పకుండా వెళ్లదు లీల

గబగబా బయటికి నడిచాడు రామనాథం పిట్టగోడకు ఇవతలగా నిలబడి ఎక్కింటి సూర్యాన్ని కేకేశాడు అయిదు నిముషాలకిగాని రాలేదు సూర్యం

"బాబూ ప్రక్క వీధిలో శ్యామలా వాళ్ల ఇంట్లో మా లీల వుందేమో, చూసి వస్తావూ?" దీనంగా ధ్వనించింది రామనాథం కంఠం

ఏ కళనున్నాడో సూరి వెంటనే ఒప్పేసుకొన్నాడు మరుక్షణంలో కనుమరుగయ్యాడు పిట్టగోడను ఆనుకొని భారంగా నుంచుండిపోయాడు రామనాథం అలా ఎంతసేపున్నాడో తెలీదు సూరివాళ్ల ఇంట్లో గోడియారం పదికొట్టడం వినిపించింది పిట్టగోడకు ఆన్చిన చేతులు నెప్పులు పుడుతున్నాయి గరుగ్గా తగులుతోంది గోడ ఎడమకాలు తిమ్మిరి పట్టింది అయినా రామనాథం కదలలేదు ఎదురుగుండా వీధిలోకి రివ్వున వో లారీ వెళ్లింది దాని వెంట మరోటి వాటివేగం చూస్తుంటే రామనాథం గుండెలవిసిపోయాయి కొంపదీసి లీలకు ఏ ప్రమాదమూ సంభవించలేదు కదా?

సూరి వచ్చాడు "లీల అక్కయ్య అక్కడ లేదు మామయ్యా" అన్నాడు

"మరి శ్యామలి అక్కయ్య?"

"వుంది మామయ్యా"

"లీలని గురించి అడగలేదూ మరి?"

"అడిగాను మామయ్యా కాలేజీ వదిలేశాక తను చూడలేదంది"

లటుగుండా వీధిలోకి మరోలారీ దూసుకు పోయింది హెడ్‌లైటు కాంతి రామనాథం మొహం మీదపడి కాసేపు అంధుడిని చేసింది భారంగా వెనుదిరిగాడు

కాలేజీలో ఏదైనా ఫంక్షన్ వుంటే శ్యామలి మాత్రం ఇంట్లో ఎందుకుంటుంది? అవుతే లీల ఎక్కడికి వెళ్లినట్లు?

వాతావరణమంతా వింతగా, అసహజంగా వుంది అతనికి రివ్వున గాలి వీస్తున్నట్లు, ఆకాశం ఉరుముతున్నట్లు వూహించుకుని గజగజలాడి పోయాడు

లాభంలేదు తనే బయటికి వెళ్లి వెతకాలి ఇంట్లోకి నడిచి జోళ్ళు వేసుకుంటూంటే గుమ్మంలో అలికిడి అయింది వేగంగా నడుస్తూ లీల లోపలికి వచ్చింది.

"ఏమైంది వసూ మన ఈ జీవితాలకి? కొద్ది పాటి సంపాదన అయినా తృప్తిగా, హాయిగా వున్నాం లోకంలో ఎందరికంటేనో ఎన్నో వందపాళ్ళు నయం"

"నయం!" వ్యంగ్యంగా నవ్వింది వసుంధర "మీ మాటల్లో నిజానిజాలు మీ ఆత్మనే ప్రశ్నించుకోండి ఆరేళ్ళ వైవాహిక జీవితంలో ఒక్క సరదా జరుపుకొన్నామా? ఆరేళ్ళలో ఎన్ని సినిమాలు చూశాం చెప్పండి వేళ్ళమీద లెక్క పెట్టవచ్చు ఒక్క పూలెన్నామా? మంచి బట్ట కట్టామా? ఏమిటి మనం జీవించేది? ఇది ఏం జీవితమేనా? తినటం, నిద్రపోవటం తప్పనిస్తే మనకి పశువులకి భేదం ఏమిటి చెప్పండి?"

"వసూ!"

"కోపం ఎందుకూ? ఉన్నమాట చెప్పాను అయినా అవన్నీ త్రవ్వుకొని ఏంలాభం? నాకుమాత్రం విడాకులు కావాలి" నిక్కచ్చిగా చెప్పింది వసుంధర

"నీ మనసు బాగులేదు వసూ సరిగ్గా ఆలోచించలేక పోతున్నావు విడాకులంటే తమాషా అనుకొన్నావా? వివాహబంధం అంత తేలికగా తెగిపోతుందా? అమ్మా వాళ్ళు ఏమనుకొంటారు! నలుగురూ నవ్విపోరూ"

"అదిగో! అది మీ ధోరణి అమ్మా వాళ్ళు ఏమనుకుంటారు, నలుగురూ ఏమంటారు ఈ అనుకొనే నలుగురికోసం బ్రతకటం నాకిష్టం లేదు నా జీవితం జీవించే హక్కు నాకు కావాలి నా జీవితాన్ని, సాఫీగా ఆనందంగా మలచుకొనే అవకాశం నాకు లభించాలి మీరు చెప్పే ఆనందం, తృప్తి ఎంత తరచి చూసినా నాకీ దారిద్ర్యంలో గోచరించవు బహుశా మీరు మానవాతీతులు కావచ్చు ఆనందానికి, ఆశలకి బహుదూరం వుండ వచ్చు పోతే అది అలవర్చుకోమని నిర్బంధించే అధికారం మీకులేదు!"

వసుంధర మాటలు ఒక్కొక్కటి ఒక్కొక్క సమ్మెట పెట్టులా తన హృదయకుహరాన్ని బద్దలు చేయసాగాయి విషాద భూయిష్ఠమైన మౌనం అలుముకొంది వసుంధర మాటలు అప్పుడే తమ ఇద్దరి మధ్య బాంధవ్యాన్ని త్రెంచేసే అడ్డుగోడ కడుతున్నట్లనిపించింది అతనికి

"మనిద్దరి పెళ్ళి అలానే జరిగింది బొమ్మలాటలా! పెద్దలు చూశారు, మాట్లాడారు, మనిద్దరినీ వివాహపు బలిపీఠం మీదికి త్రోశారు నాకు అప్పుడు తెలివి లేదనుకొంటాను లేక ప్రపంచంలో నాకు కావలసిం దేమిటో తెలుసుకోలేని పరిస్థితిలో వున్నాననుకొంటాను మీరు కూడ భార్యవుంది కాబట్టి ప్రేమించారు మీ ప్రేమలో ఏ విశిష్టతా లేదు క్షుణ్ణంగా ఆలోచించండి మన వివాహం విఫలంకాదూ? దాన్నుంచి ఏమైనా సాధించామా మనం? ఏమాత్రమేనా మానసికానందాన్ని పొందామా? భార్యగా నేను నా విద్యుక్తధర్మాన్ని నిర్వర్తించ ప్రయత్నించాను అది నావల్ల కావటం లేదు వీలుకానప్పుడు ఆచారాల ముసుగుల క్రింద రోజుకోవటం ఎందుకూ? మనం ఒకర్నొకరు వదిలి వెళ్ళటమే మంచిది"

తనకీ కోపం వచ్చింది "అవును! నా ఇంట్లో రేడియో లేదు కారులేదు సిల్కు చీరలు ముట్టచెప్పలేను నీకు! వెళ్ళు ఆ మోహన్‌గాడు, ఆ కృతజ్ఞత లేని మిత్రద్రోహి నీకు ఆనందం కలిగిస్తాడు" కేకలు వెయ్యసాగాడు

"మోహన్ సంగతి మనిద్దరి మధ్య ఎందుకూ? నేను అడిగిన విషయం చెప్పండి"

కుప్పలా కూలిపోయాడు తను విషాదంతో గుండె బద్దలైంది రాత్రంతా బ్రతిమాలాడు వసుంధరని సరిగ్గా ఆలోచించమన్నాడు

కానీ

వసుంధర తనమాట లెక్కచెయ్యలేదు ఫలితంగా తను, వసుంధరా విడిపోవాల్సి వచ్చింది వసుంధర కారు, బంగళా, హోదా, పలుకుబడి వున్న మోహన్ జీవితంలో అడుగుపెట్టింది అవేవీలేని తను, నాలుగేళ్ళ లీలతో, ఆ వూరు వదలి, పాత జ్ఞాపకాలకి దూరంగా సుదూరంగా ప్రశాంతిని వెతుక్కుంటూ ఇక్కడికి వచ్చేశాడు

—రామనాథం బుగ్గల మీద నీరు జారసాగింది

"ఏమిటనాన్నా! ఏడుస్తున్నావు?" కంగారు పడుతూ లేచి కూర్చుంది లీల

రామనాథం ఉలిక్కిపడ్డాడు "ఏమీ లేదమ్మా మీ అమ్మ గుర్తుకు వచ్చింది" అన్నాడు

"చనిపోయిన అమ్మ ఎక్కడ నుంచి వస్తుంది నాన్నా నువ్వు అవన్నీ ఆలోచించకూడదు అసలే నీ ఆరోగ్యం బాగా లేదు పడుకో నాన్నా చాలా ప్రొద్దుపోయింది" లీల మాటలతో కన్నీరు తుడుచుకొని దిండుమీద వాలాడు రామనాథం పిచ్చితల్లి! వాళ్ళమ్మ నిజంగానే చనిపోయిందనుకొంది ఎక్కడో మోహన్‌తో కారులో తిరుగుతోంటుందని తెలీదు ఆ సంగతి తెలిస్తే లీల మనోభావాలు ఎలా వుంటాయో! తల్లడిల్లిపోదూ? రూపురేఖల్లో వసుంధర పోలికలు కొట్టవచ్చినట్లు కనుపించినా, స్వభావంలో మటుకు లీల విభిన్నమైంది అల్ప సంతోషి అతిశయాలు, డాబులూ లేశమాత్రమైనా లేవు తను ఎంత చెబితే అంత లీల జీవితమేనా బాగుపడాలి తనకి కనీసం ఆత్మ సంతృప్తైనా వుంటుంది ఆలోచనలతో సతమతమవుతూ నిద్రలోకి జారుకొన్నాడు రామనాథం!

*　　　*　　　*

ప్రశాంతంగా తెల్లవారింది బాలభానుని లేత కిరణాలు మొహంమీదపడి నిద్రాదేవిని తరిమికొట్టాయి బద్ధకంగా లేచి కూర్చున్నాడు రామనాథం ఇంట్లోంచి శ్రావ్యంగా మంగళారావం వినవస్తోంది లీల పూజ చేస్తోంది కాబోలు తొందరగా లేచి దంతధావనం ముగించుకున్నాడు స్నానంచేసివచ్చేటప్పటికి లీల హారతిపళ్ళెం తీసుకవచ్చింది భక్తితో హారతి పళ్ళెంలోని దీపశిఖవైపు చేతులు పోనిచ్చి, ఆహస్తాలని కళ్ళకద్దుకున్నాడు రామనాథం కాఫీ తెచ్చియిచ్చింది లీల త్రాగుతూ ఆమెకేసి పరికించి చూశాడు తలంటు పోసుకొనివుంది లీల

"ఏమిటమ్మా విశేషం?" అన్నాడు కూతురిని పరికించి చూస్తూ

"ఇవాళ నాపుట్టిన రోజునాన్నా" అందిలీల

"అవునమ్మా! నేను మర్చేపోయాను" అన్నాడే గాని రామనాథం మనసు అదోలా అయింది లీల ప్రతి పుట్టిన రోజుకీ ఏదోఒకబహుమతి తెచ్చేవాడు తను కాని ఇవాళ చేతులో దమ్మిడీలేదు నెలాఖరు రోజులు అప్పుమాత్రం ఎక్కడనుండి తేగలడు?


"నీస్నేహితురాళ్ళనందరినీ పిలిచావా అమ్మా? స్పెషల్స్ ఏంచేస్తున్నావు మరి?" అన్నాడు

"అందరూ ఎవరున్నారునాన్నా శ్యామలీ వాళ్ళు, సూరి, అన్నట్లు మిసెస్‌రావుని కూడా ఆహ్వానించాను నాన్నా" అంది

"అలానా" అన్నాడు ఆలోచనలోంచి తెములలేక పోతున్నాడు రామనాథం ఎందుకో యీమాటు లీల పుట్టినరోజు సంగతే గుర్తులేదు ముందుగా తెలిసి వుంటే ఎంత బాగుండేది?

"సాయంకాలం బడినుండి తొందరగా వచ్చెయ్యి నాన్నా మర్చిపోకేం"

మౌనంగా తలూపాడు పదింటిదాకా ఆలోచిస్తూనే కూర్చున్నాడు ఏమిటో జీవితం చాలీచాలని జీతాలు, పెరిగిపోతున్న ధరలు! అమ్మాయిని చదివించటానికే తలప్రాణం తోకకివస్తోంది రేపుదాని వివా



కాం చెయ్యాలంటే ఎలాగ? మొన్నవచ్చి చూసిపోయిన డాక్టరీ చేస్తున్న అబ్బాయి ఏమంటాడో! కట్నాలు పుచ్చుకోకూడదని శాసనాలు చేశారేకాని ఆచరిస్తున్న వాళ్ళెవరు? వేనకువేలు పోయాలి అదిచేతకాక పోతే లీలని తనలాంటి ఏబడిపంతులుకో అంటగట్టాలి తనజీవితమే దరిద్రంతో నిండిపోయింది చూస్తూ చూస్తూ దాని జీవితాన్ని కూడా నాశనం చెయ్యట మేమిటి?

ఆపూట బడిలో పాఠాలు యాంత్రికంగా చెప్పాక పోయాడు రామనాథం లీలకి ఏచీర కొందామన్నా పాతికరూపాయలు కావాలి ఎవర్నడగాలి అప్పు? అప్పుఅడగటమే వో నేరంగా భావింపబడుతోంది ఈరోజుల్లో అడగ్గానే, యివ్వరుకదా పైగా ఏవో మాటలంటారు వారి దృష్టిలో తను అమాంతంగా అధఃపాతాళంలోకి ఎడిపోతాడు ఛీ ఛీ! రానురాను ప్రపంచం ఇలా మారిపోతోందేమిటి? డబ్బుకున్న విలువ వ్యక్తిత్వానికి లేకపోతోంది

వ్యక్తిత్వం!— నవ్వొచ్చింది రామనాథానికి తన వ్యక్తిత్వం ఎవరికి కావాలి? ఇతర్లకి అందువల్ల లాభంవేదేమిటి? కట్టుకొన్న భార్యే తన వ్యక్తిత్వాన్ని గడ్డిపరక్కు సమానంగా ఎంచింది లవును మరి వ్యక్తిత్వం డబ్బులు సంపాదించలేదుగా! ఆత్మాభిమానంతో రూపు చేసుకొన్న యీ వ్యక్తిత్వం, ప్రతి పనికి అడ్డువస్తూ తనకే విసుగుపుట్టిస్తోంది అయినా అలాంటి వ్యక్తిత్వాన్ని కూడ చంపుకోదల్చుకోలేదు రామనాథం జేబులోని రెండు రూపాయల చిల్లరలోనే నోజాకెట్ గుడ్డకొని ఇంటికి బయలుదేరాడు

ఆవరణముందు కారు ఆగివుంది మిసెస్‌రావుది కాబోలు గేటుతీసి లోపలికి నడిచాడు గుమ్మంలో నిలబడివున్న లీలమొహంలో ఆనందం వెల్లివిరిసింది

"వచ్చావానాన్నా నీకోసమే కాచుకొని వున్నాను" అంది

ఒకక్షణం లీలని గుర్తుపట్టలేక పోయాడు రామనాథం లేత ఆకుపచ్చ టెర్లిన్‌చీరలో, జరీజాకెట్‌లో లీల మెరిసి పోతోంది

కాటుక అలమినకళ్ళలో, మెరసిపోయే తోలాకులతో క్రొత్త అందాల సంతరించుకొని లక్ష్మీదేవిలా అగుపించింది అతనికి

తదేకంగా వీక్షిస్తున్న తండ్రిని చూసి, సిగ్గుతో అందిలీల "మిసెస్‌రావుగారు బహూకరించింది నాన్నా నేను కట్టుకొనేదాకా ఆగలేదు నడు నాన్నా"

లోపలికి నడచిన రామనాథం మిసెస్‌రావుని చూసి స్తంభీభూతుడై నిలుచుండి పోయాడు

కుర్చీలో ఠీవిగాకూర్చొని వసుంధర నవ్వుతోంది! పరిచయ వాక్యాలు పలికింది లీల కాసేపు నోట మాటరాలేదు రామనాథానికి వసుంధరలో ఏమాత్రమూ ఆశ్చర్యంలేదు ఆమెకీవిషయాలు ముందుగానే తెలిసినట్లున్నాయి రామనాథానికి సంభ్రమం కలిగిస్తున్న సన్నివేశాన్ని ఆమె తేలిగ్గా తీసుకుంది పైగా నవ్వుకొంటోంది

శ్యామలీవాళ్ళు వచ్చారు లీల అటుకేసి పరుగు తీసింది

"కూర్చోండి" అంది వసుంధర

సంభ్రమం నుంచి తేరుకొని కుర్చీలో కూర్చున్నాడు రామనాథం క్షణకాలం మౌనం ఆవరించుకొంది వసుంధర ఎప్పటిలా నిండు మందహాసంతో వుంది.

# నిర్ణయాలు నిర్బంధాలు

"ఆశ్చర్యంగా వుందా మీకు?" అంది

"ఆసంగతి అటుంచు ముందీ విషయం చెప్పు మనసంగతి లీలకు తెలుసా?"

"వూహూ!"

"బ్రతికించావు ఇకముందు కూడా చెప్పకు"

"ఏం?" కళ్ళు త్రిప్పుతూ అడిగింది

"అవన్నీచెప్ప టానికి టైంలేదు లీలకు మాత్రం తెలియ నివ్వకు" అన్నాడు రామనాథం

వసుంధర చిన్నగా నవ్వింది!

శ్యామలీ, మరో యిద్దరమ్మాయిలతోపాటు లీల లోపలికి వచ్చింది నమస్కారాలు అందుకొని, కుశల ప్రశ్నలు వేశాడు రామనాథం

యధావిధిగా తతంగం జరిగిపోయింది 'హాపీ బర్త్‌డే టుయూ' అంటూ పాటలు పాడారు శ్యామలీ తదితరులు లీల కేక్ కట్ చేసింది రామనాథం దృష్టంతా వసుంధర మీదేవుంది మిసెస్‌రావు అంటే మిసెస్ మోహనరావు అన్నమాట వసుంధర ఏమీ మారినట్టు లేదు కొంచెం లావయింది జుత్తు అక్కడక్కడా నెరిసింది కానికళ జోడు వెనకాల విప్పారివున్న నయనాలో మాత్రం జీవం ఏ కోశానా వున్నట్టు అగుపించలేదు రామనాథానికి ఎందుకో ఆమె చాలా విషాదానికి గురియై వుండాలనిపించింది అతనికి అవునుమరి అసాధారణ జీవితాలు గడిపేవారికి ఆనందం ఎలా లభిస్తుంది?

శ్యామలి ఏదో పుస్తకం బహూకరించింది మరో అమ్మాయి టేబుల్‌లైట్, వసుంధర వ్యానిటీ బ్యాగ్ తెరచి వో లేడీస్ రిస్టువాచి తీసి లీలకు అందించింది

విచిత్రంగా చూశాయి లీల నయనాలు "రెండు బహుమతులా! అందులోనూ ఇంత ఖరీదైనవి నాకొద్దండీ" అంది

"ఖరీదైనవేమిటి నామొహం! వందరూపాయలు కూడా చెయ్యదు" లీలని బలవంతాన అంగీకరింపజేస్తూ, స్వయంగా ఆమె హస్తానికి అలంకరించిందా రిస్టువాచిని వసుంధర

"లాభసాటి పుట్టినరోజు లీలా" అంది శ్యామలి మరో లమ్మాయి కొద్దిగా యీర్ష్య పడ్డట్టు అగుపించింది

నిస్తేజంగా చూస్తున్నాడు రామనాథం వాళ్ళ బహుమతులముందు తను తెచ్చిన జాకెట్‌గుడ్డ ఏపాటిది? వసుంధర బహుమతిని, సందిగ్ధంగా అందుకొన్నా లీల కళ్ళలో వెలుగు అతన్ని బాధించింది లీలకూడా ఆ ఆకర్షణలవేపు మొగ్గుతోందా? వసుంధర మళ్లీ తన జీవితంలో కల్లోలం లేపటానికే వచ్చిందా?

"ఏదీనాన్నా నీబహుమతి?" అంది లీల

అప్రయత్నంగా చేతిలోని ప్యాకెట్‌ని అందించాడు వేగంగా కవర్ తొలగించింది లీల చీటీగుడ్డ వెలవెలబోతున్నట్టు అనిపించింది రామనాథానికి వసుంధర హాస్యం, చెప్పబడ్డ శ్యామలి ఉత్సాహం లతన్ని కలవరపరిచాయి ఆతృతగా లీలమొహంలోకి చూశాడు

లీల విశాలనయనాలు మరింత విశాలమైనాయి "చాలా బాగుందినాన్నా నీకు నా టేస్టేమిటో బాగా తెలుసు ఇలాంటిది కొందామని చాలరోజులుగా అనుకొంటున్నాను"

రామనాథం సంతృప్తిగా నిట్టూర్పు వదిలాడు. అయినా అనుమానం మెదలుతూనే వుంది లీల నిజంగా అందా, లేక తనని చిన్న బుచ్చటం ఇష్టంలేక అందా?

స్వీట్ తీసుకవచ్చి అందించింది లీల "స్వయంపాకమండోయ్ ఎలావుంటుందోమరి" అంది వసుంధర నుద్దేశించి

"దీనికేం, దివ్యంగా వుంది చిన్నతనంలో నేనిలా కూడ చెయ్యలేక పోయేదాన్ని" అంది వసుంధర

అవును పెళ్లయిన క్రొత్తల్లో వసుంధరకి వంటే చేతనయ్యేదికాదు నేర్చుకోటానికి ఎద్దకం ఆ బద్ధకమే తమ జీవితాలని వింత పరిణామాలకు దారి తీయించింది

కారప్పూస నోట్లో వేసుకొని, కాఫీ అందుకున్నాడు రామనాథం వసుంధర లీలప్రక్కన కూర్చొని కబుర్లు చెబుతోంది అప్రయత్నంగా రామనాథం కళ్ళు చెమర్చాయి తనని వదలి వెళ్ళకుండావుంటే, రోజూ ఇలానే కబుర్లు చెప్పేదికదూ లీలకి ఎంతైనా తల్లీ కూతుళ్ళు వూహూ ఆ బాంధవ్యం ఇప్పుడెక్కడుంది? తనకి, వసుంధరకి వెయ్యి ఆమడల దూరమిపుడు

కాలంగడచిపోతోంది శ్యామలీ వాళ్ళు వెడతామంటూ లేచినుంచున్నారు

"వీధిలో దాకా రాదూ లీలా" అంది శ్యామలి

లీల రామనాథంవంక వోమాటు దృక్కులు చరచి, వసుంధర వేపు తిరిగింది

"ఫరవాలేదు వెళ్లిరామ్మా, మీ నాన్నగారితో మాట్లాడుతుంటానులే నేను" అంది వసుంధర ఆమె ఆ అవకాశం కొసమే వేచివున్నట్లు అనిపించింది రామనాథానికి లీల మవునంగా తన స్నేహితురాళ్లతో పాటు బయటికి నడచింది

హాల్లో వంటరిగా మిగిలిపోయారు రామనాథం, వసుంధరాను ఎందుకో కళ్ళెత్తి ఆమెకేసి చూడలేక పోతున్నాడు రామనాథం కొద్దిగా అసహ్యం కూడ వేస్తోంది

"కులాసాగా వున్నారా?" అంది వసుంధర

"ఆ!"

"మీరు ఏమీ మారలేదు"

అది ప్రశ్నో, లేక మరేదో సంభాషణకి నాందో తేల్చుకోలేక, ఏసమాధానము యివ్వలేద రామనాథం

"మాట్లాడరేం! నామీద ఇంకా కోపంపోలేదా?"

"కోపం ఏముంది?" అన్నాడు పొడిగా

"కోపంకాకపోతే అసహ్యం అన్నమాట మీరు చెప్పకపోయినా మీ ముఖభావాలే వ్యక్తీకరిస్తున్నాయి లెండి పోనీ కనీసం కుతూహలమైనా లేదూమీలో?"

"కుతూహలమా? ఎందుకూ?"

"ఎందుకేమిటి? నా గురించి తెలుసుకోవాలని లేదూ? ఇన్నేళ్ళ ఎలావున్నానో, ఎలా జీవించానో అవేనా అడగాలనిలేదూ మీకు?" అంది

"ఎలావుంటావు! చాలా ఆనందంగా వుండి వుంటావు"

నవ్వింది వసుంధర "నిజంచెప్పండి నానుండి ఆ సమాధానం ఆశించారా మీరు? మీనుండి విడిపోయాక బాధలుపడి వుంటానని, ఆశించినవి అందుకోలేక విషాదం పాలై పశ్చాత్తాప పడి వుంటాననుకున్నారు కదూ? అబ్బే! అదేంలేదు.

వోహాక్ పోయాక కూడా అంత బాధ వెయ్యలేదు. డబ్బుందిగా. అన్ని బాధలు కప్పి పెడుతోంది. చూస్తున్నారుగా— క్రొత్తగావచ్చినా నాకీ వూళ్లో సభలు, సన్మానాలు కూడా చేస్తున్నారు."

"ఇంకేం! ఆశించిన జీవితాన్ని అందుకొన్నావు. నువ్వు హాయిగా వుంటే అదేచాలు." నిర్లిప్తంగా అన్నాడు రామనాథం.

కుర్చీ చేతి మీద వ్రేళ్లను విలాసంగా తాటిస్తూ, మందస్మితం చేసింది వసుంధర, "అదీ పూర్తిగా నిజంకాదు. ఏదో వెలితి మాత్రం అగుపిస్తూనే వుంది. లీలని గుర్తించాక అదీ తీరిపోయింది."

"వసుంధరా" గంభీరంగా అన్నాడు రామనాథం. "దయచేసి దాని జీవితంతో మటుకు ఆడుకోవద్దు."

"ఆడుకోవటమా!"

"ఆ! ఆడుకోవటమే. జీవితాలని బొమ్మలాటల్లా ఆడించటం నీతత్వం. నీ డాబు, దర్పా, డబ్బు చూపించి దాని మనసు కూడ అటువేపు త్రిప్పుతా వేమోనని భయంగా వుంది. నాకు ఒక్కగాని కూతురది. దానికోసమే జీవిస్తున్నాను. దాని ఆనందం తోనే నా జీవితం ముడిపడివుంది. ఆ అమాయక హృదయంలో నీ పిచ్చితలంపులు ప్రవేశపెట్టా వంటే దాని జీవితమూ భగ్నం అవుతుంది. అతి శయాలకి పోయి, అందని మ్రానిపళ్లకి అర్రులు చాచి జీవితాన్ని అపహాస్యం చేసుకుంటుంది నీలాగ..."

మధ్యలోనే ఆపింది వసుంధర. "నా జీవితాన్ని నేను అపహాస్యం చేసుకోలేదు. పైగా మీరు లీల నా కూతురన్న విషయాన్ని విస్మరిస్తున్నారు."

"ఆ బంధం ఎన్నడో తెగిపోయింది. పదునాలు గేళ్ల క్రితం అక్కర్లేని లీల నీ కిప్పుడెందుకూ? న్నింకా నాశనం చెయ్యదల్చుకొన్నావా?"

"మీరు పొరబడ్డారు. మిమ్మల్ని నేనెందుకు నాశనం చేస్తాను? .........అయినా మాతృహృదయం మీకు అర్థంకాదు లెండి.........."

"హృదయం అంటూ వుంటేగా?"

సమాధానం ఇవ్వలేదు వసుంధర. మౌనంగా కూర్చుంది. రామనాథానికి తన ఆవేశానికి తనకే సిగ్గేసింది. ఆమెని శాసించటానికి, కనీసం సూటి మాట అనటానికి కూడా హక్కులేదు ఈనాడు తనకు. ఇవేమాటలు అప్పట్లో అనివుంటే వర్రుకు లేచేది వసుంధర. కానీ నేడుమాత్రం విషాదమూర్తిలా తలవంచుకొని తన అభిభాషణని మన్నిస్తోంది ఎందు చేతనో!

కాసేపాగి అంది వసుంధర: "మీ ఆర్థిక పరి స్థితి ఏమీ మారినట్లు లేదు." అని.

ఏమని సమాధానం యివ్వగలడు?

"వంట అమ్మాయితోనే చేయిస్తున్నారా?"

"చూడు వసుంధరా— నువ్వేదో బాధపడి పోతున్నట్లు, అమ్మాయంటే నీకు ప్రేమ ఒలికి పోతున్నట్లు నటించకు. లీల సంరక్షణ బాధ్యత లేపో నాకు సంపూర్తిగా తెలుసు. అది కాలేజీలో అడుగు పెట్టేదాకా నేనే వంటచేశాను. ఆఖరుకి కొన్ని సమయాల్లో దానికి తలదువ్వి జడకూడా వెయ్యాల్సి వచ్చేది. ఇప్పుడు పెద్దదైంది. తన బాధ్యత ఏమిటో, వున్న పరిస్థితులేమిటో ఆకళింపు చేసుకొంది. నాచేత ఇంటి పని ఒకటీ చేయించదు. నేను వంట పనికి దిగితే తను భోంచేయనంటుంది. ఇహ పోతే వంటవారిని పెట్టుకొనే తాహతా— లేదు."

"ఏమీ ఆదా చెయ్యలేకపోయారా?"

వసుంధర కంఠంలో సానుభూతి రామనాథాన్ని బంధించింది. తల వంచుకొని సమాధానం ఇచ్చాడు. "బడిపంతులు ఏమాత్రం ఆదా చెయ్యగలడు చెప్పు?"

మళ్ళీ కాసేపు నిశ్శబ్దం అలుముకొంది. ఆ నిశ్శ బ్దపు అలల్లో వసుంధర నిట్టూర్పులు కలసి పోయాయి. ఆఖరుకి అంది. "లీల నాతో వుంటే బాగుండేది. ఈ కష్టాలు దానికేనా తప్పేవి. మాణి క్యములాంటి పిల్ల ఆ ముతక చీరల్లో వెలవెలా బోతోంది. నాతోవుంటే కార్లలో తిరిగేది. కులాసాయైన జీవితాన్ని గడిపేది. ఏమీ ఆదా చెయ్యలేదంటున్నారు. రేపు దాని పెళ్లి ఎలాచేస్తారు? మళ్లీ ఏ గుమాస్తాకో యిచ్చి దాని గొంతుకోస్తారు. అవునా?"

"వసుంధరా!" గర్జించాడు రామనాథం. "నీమాటలతో నన్ను అవమానిస్తున్నావు తెలుసా!" అన్నాడు. కోపంతో అలా అన్నాడే కాని వసుంధర మాటల్లోని చేదు నిజం బాణంలా గ్రుచ్చుకొంది అతని హృదయానికి. నిజమే. లీల తన దగ్గరకన్నా వసుంధర దగ్గరే హాయిగా వుండేదేమో!

రామనాథం కోపాన్ని వసుంధర చిర్నగవుతో స్వీకరించింది. "మీ ఆత్మాభిమానం ఏమీ తగ్గ లేదు. ఈ జన్మలో మారరనుకుంటాను మీరు. అయినా కొద్దిగా ఆలోచించండి. కోపతాపాలకి పోవటానికి, తరగని అహానికి లోనుకావటానికి ఇది కేవలం మీ స్వవిషయం కాదు. లీలకి సంబంధిం చింది. సలహా యివ్వడానికి ఇవాళ నాకు హక్కు లేకపోవచ్చు. కాని లీల నా కూతురన్న విషయం మాత్రం మర్చిపోలేను. నేను జీవితంలో పడ్డ బాధకి, అసంతృప్తికి అది లోను కాకూడదని తల్లిగా నేను అభిలషిస్తాను. నేను జీవితంలో చేసిన పొర బాట్లని అది చెయ్యకూడదని, నాకు అనుభవం నేర్పిన పాఠాలని అదీ గ్రహించాలని ఆశిస్తాను. ఇది తప్పంటారా?"

"వసుంధరా. డొంక తిరుగుళ్లు మానేసి నీ ఉద్దేశ మేమిటో సూటిగా చెబితే సంతోషిస్తాను."

ఒకక్షణం వసుంధర తలఎత్తి రామనాథంకేసి సూటిగా చూసింది. తరువాత నెమ్మదిగా "లీలను నా దగ్గిర ఎందుకు వదిలెట్టకూడదు మీరు" అంది.


"లేదు— లేదు! నేనాపని చెయ్యలేను." బిగ్గరగా అరిచాడు రామనాథం. "నువ్వు అసంభవమైన విషయాన్ని అడుగుతున్నావు. లీలను వదలి ఒక్క క్షణంకూడా వుండలేను నేను."

"అంటే స్వార్థానికి పోతున్నారన్నమాట" అంది వసుంధర.

"స్వార్థమా?"

"కాకపోతే మరేమిటి? లీలని వదలి క్షణం వుండ లేరు కాబట్టి దాన్ని నా దగ్గిర వదలరు. లీల లేక పోతే మీకు ఆనందం వుండదు. అంతేగా మీదు అనేది! కాని అది ఆడపిల్ల. ఏ నాటికేనా అత్త వారింటికి వెళ్లాల్సిందే. అప్పుడుమాత్రం బాధ పడరూ మీరు. ఆ బాధేదో యిప్పుడే ఎందుకు పడరాదు. లీల వివాహం ఏ పెద్ద ఉద్యోగస్తునితోనో అవుతుంది. అది సుఖంగా వుంటుంది. దాని సుఖ మేగా మీరు ఆశించేది..........."

రామనాథం తల గిర్రున తిరిగిపోయింది. తనది స్వార్థమా? స్వార్థం వల్లనే లీలని చిన్నప్పటి నుండి పెంచి పెద్దజేశాడా? స్నానాలు చేయించి,



గొన్ను కట్టబెట్టి, తలదువ్వి బడిదాక వదలి రావటం స్వార్థంకోసమేనా? ఆర్థిక పరిస్థితి దుర్భరంగా వున్నా అన్ని బాధలూ వోర్చి లీలని కాలేజీలో చేర్పించాడే అది స్వార్థమేనా?— వసుంధర అంటున్న విషయాలని తనీనాటి దాకా ఆలోచించలేదు లీల వివాహమై, అది అత్తవారింటికి వెళ్ళిపోతే తన గతేమిటి? జీవితంలో ఏం చూసుక బ్రతకాలి తను? నిజమే— లీల సుఖంగా వుండటమే తన ఆశయం కావచ్చు అంతమాత్రాన వసుంధర దగ్గిర లీలను వదిలెట్టలేడు వసుంధర తల్లే కావచ్చు నేడు

## నిర్ణయాలు నిర్బంధాలు

ప్రపంచంలో లీల ఆమెకి ప్రాణప్రదమైందే కావచ్చు కాని తనుమాత్రం లీలని ఆమె దగ్గిర వదలలేడు తల తాకట్టు పెట్టయినా సరే లీల జీవితం తనే స్వయంగా ఆనందమయం చేస్తాడు

వసుంధరతో అన్నాడు "నువ్వు చాలా అసహజంగా మాట్లాడుతున్నావు వసుంధరా నాలుగేళ్ళ కూతురుని లెక్కచెయ్యక నీ సుఖం చూసుక వెళ్ళిపోయిన నువ్వు స్వార్థాన్ని గురించి వాకు చెబుతున్నావు! అయినా అప్రస్తుత విషయాలను గురించి చర్చ అనవసరం లీల విషయంలో నేను సంపూర్ణమైన బాధ్యతను వహించగలను ఇన్నాళ్ళు ఎలా నిశ్చింతగా వున్నావో ఇప్పుడూ అలానేవుండు"

నవ్వింది వసుంధర "నన్ను దెప్పి పొడవటం తప్పనిస్తే మరేమీ చెయ్యటం లేదుమీరు అసలింతకీ దాని వివాహ విషయం ఏమైనా తలపెట్టారా?"

"ఆ! మొన్ననే ఎవరో పెళ్ళిచూపులకి వచ్చి వెళ్ళారు కూడ"

"ఏం చేస్తున్నాడు అబ్బాయి?"

"డాక్టరీ పాసయ్యాడు"

"ఏమన్నారు?"

"సమాధానం కొద్దిరోజుల్లో, తెలుపుతామన్నారు"

"కట్నం అడిగితే ఏంచేస్తారు?"

రామనాథం చిరాకెత్తిపోయాడు "దయచేసి కాసేపు వూరుకో వసుంధరా నన్ను విసిగించి చంపేస్తున్నావు" అన్నాడు

"మీ ఇష్టం అమ్మాయిని నా దగ్గిర వదిలితే బాగుంటుందని "

మధ్యలోనే ఆపాడు "అమ్మాయిని నీ దగ్గిర వదలను లీల నా దగ్గిరే చక్కగా పెరగ్గలదు. నువ్వా విషయం ప్రక్కకునెట్టి, మాట్లాడదలిస్తే మరేదేనా మాట్లాడు"

వసుంధర ఇక ఆ విషయమై వత్తిడి చెయ్యలేదు మరేదేనా మాట్లాడటానికి యిద్దరికీ తోచలేదు మౌనంగా కూర్చున్నారు ఆ మౌనంలో ఎంతో బాధ! ఎన్నో భావాలు! సతమతం చేసే ఆలోచనలు! వసుంధర కళ్ళు ఇంట్లో చౌకబారు ఫర్నీచర్‌ని, కోటుస్టాండుకు తగిలించి వున్న తన చిరిగిన చొక్కాలని పరికించటం రామనాథానికి రుచించలేదు ఎప్పుడూ దారిద్ర్యాన్ని ఓ వెరితిగా ఎంచనివాడు వసుంధర ముందు న్యూనతకు లోనవ్వుతున్నాడు

"చాలా ఆలస్యమైంది క్షమించండి మిసెస్ రావ్"— విచిత్రమైన నిశ్శబ్దతని విడదీస్తూ లీల ప్రవేశించింది రామనాథం హాయిగా వూపిరి పీల్చుకొన్నాడు

* * *

రోజులు గడుస్తున్నాయి వసుంధర, లీలల మధ్య అన్యోన్యత పెరగటం రామనాథం గమనిస్తూనే వున్నాడు కాని ఏమీ చెయ్యలేక పోతున్నాడు వాళ్ళిద్దరి మైత్రిని విచ్ఛిన్నం చెయ్యటానికి తనకి అధికారం వుందో లేదో, అలా చెయ్యటం న్యాయమో, అన్యాయమో తేల్చుకోలేక పోతున్నాడు పదునాలుగేళ్ల క్రితం తనని వదలిపోయిన వసుంధర నేడు యిక్కడ అవతరించటం, లీలమీద ఎనలేని ప్రేమ కలిగించుకోవటం కాకతాళీయంలా అగుపించలేదు రామనాథానికి ఈ హఠాత్ సంఘటన ఎలాంటి పరిణామాలకి దారితీస్తుందోనని అవ్యక్తమైన భయం ఒకటి పీడించసాగింది అతన్ని వసుంధర రాకపోకలు హెచ్చవుతున్నాయి అడపా దడపా వసుంధర లీల విషయం కదుపుతూనే వుంది ఒక్కోమాటు కళ్ల నీళ్లు పెట్టుకొనేది వసుంధరకి తను యిస్తున్న సమాధానంలో ఎలాంటి మార్పూ





రక్తాన్ని శుద్ధిచేసి బాధ కలిగించే వాటినుంచి కాపాడుతుంది కాళ్ల పగుళ్లు, ఇంకా అనేక రకాలైన చర్మవ్యాధులు ఎగ్జిమా మొటిమలు చెమటకాయలు, పెచ్చు లేవడం, పుండ్లు మున్నగునవి చాలావరకు రక్తంలోని దోషంవల్లనే సంభవిస్తవి

ఇలాంటి వ్యాధులు ఎదో పైపూతలు పూసినంత మాత్రాన తగ్గిపోగలవనుకుంటే చాలా సందర్భాలలో అలా జరగదు ఒకవేళ పూతలకు తగ్గినట్టు తగ్గినా, వెంటనే మళ్లీ అవి వస్తూ వుంటవి అందుచేతనే కొంతమంది ఏటేటా ఎగ్జిమా, చెమటకాయలు మొటిమలు కాళ్లపగుళ్లు, పుండ్లు మున్నగువాటితో బాధపడుతూ వుంటారు. ఇలాంటి వ్యాధులన్నింటికి అసలు కారణం రక్తదోషమే

రిచ్‌లెస్ బ్లడ్‌ప్యూరిఫైయర్ సేవిస్తే అది ఎంత చక్కగా పనిచేయగలదో మీకే ఆశ్చర్యం కలిగిస్తుంది శరీరం అడుగున వుండే గ్రంధు లన్నింటినీ పరిశుభ్రం చేయడమేగాక మీ రక్తం అత్యంత పరిశుభ్రమౌతుంది శరీరంపైనవుండే మచ్చలు, ఇతరత్రమైనవన్నీ కూడా అదృశ్యమైపోయి మీ శరీరం తిరిగి ఆరోగ్యప్రదమైన కాంతులీనుతూ వుంటుంది

రిచ్‌లెస్ లాక్సటీవ్‌ను, గల్లాస్ ఆయింట్‌మెంటునుకూడా వాడండి కెమిస్టులందరివద్ద, స్టోర్‌లలోను కలవు వివరాలు తెలిపే కరపత్రాన్ని అడిగి తీసికోండి

# రిచ్‌లెస్

## బ్లడ్ ప్యూరిఫైయర్

ఇండియా అంతటా ఏజెంట్లు కావాలి ఈ విలాసానికి వ్రాయండి:
ఇండియాలో సోల్ డిస్ట్రిబ్యూటర్స్

**మహేశ్వరీ జనరల్ స్టోర్స్**

**19/35, పెద్దబజారు, కోయంబత్తూరు-1**

EPMG 1

లేకపోయినా లీల అసలు విషయాన్ని పసికడుతుం దేమోనని అనుమానం వేసేది అందుకనే అంటీ అంటనట్టుగా వుండటం మొదలుపెట్టాడు

రెండు మూడు రోజులుగా లీల ఎందుకో అదోలా వుంది కూతురు తత్వం బాగా తెలుసు రామనాథానికి ఏ సంగతీ నోరు మెదపదు తను అడిగేదాకా బయట పడదు ఆఖరుకి వుండలేక అడిగేశాడు

"అబ్బే— ఏం లేదునాన్నా" అంది

తప్పించుకో జూస్తోందని తెలుస్తూనే వుంది చెప్పమని బలవంతం చేశాడు

'కాలేజీ ఫీజు కట్టాలినాన్నా" అంది ఆఖరికి

"మరి ముందుగా ఎందుకు చెప్పలేదమ్మా ఆ మాట?" అన్నాడు

లీల సమాధానం యివ్వలేదు

రామనాథానికి బాధేసింది డబ్బులేదని దానికీ తెలుసు ఎలా అడుగుతుంది మరి?

"కడదాంలేమ్మా రెండు మూడు రోజుల్లో" అన్నాడు

"అలానే నాన్నా" అంది లీల

రెండు మూడు రోజులు తొందరగా గడచి పోయాయి నయాపైసా అప్పు దొరకలేదు రామ నాథానికి తన ప్రావిడెంట్‌ఫండ్‌లోంచే అప్పు తీసుకోవటానికి ప్రయత్నించాడు నెల రోజులవుతుం దన్నారు అధికారులు

'ఆఖరు తేదీ ఎప్పుడు తల్లీ?" అనడిగాడు

"దాటిపోయింది నాన్నా ఇప్పుడే ఫైన్‌తో పుచ్చుకొంటున్నారు ఇంకా కొద్దిరోజులవుతే "

అవును ఇంకొద్ది రోజులవుతే అటెండెన్సు రిజిస్టరులోంచి పేరు కొట్టేస్తారు ఏమీ తేల్చుకో లేక పోతున్నాడు రామనాదం

'నాన్నా, మిసెస్‌రావ్‌ని అప్పు అడగనా?"

"మిసెస్‌రావ్‌నా! ఛీఛీ! వద్దమ్మా" అన్నాడు

"ఏం నాన్నా? నెలలోగా ఇచ్చేస్తామని చెబు తాను నేను అడిగితే తప్పకుండా యిస్తుంది నాన్నా ఆమె"

రామనాథం సమాధానం వెంటనే యివ్వలేక పోయాడు లీలకు ఎలా తెలియజెప్పాలో అతనికి అర్థంకావటం లేదు

లీలే అంది "తప్పం చేయటం లేదుగా నాన్నా మనం"

రామనాథం నవ్వాడు "తప్పు కాదమ్మా నేటి నాగరికతలో అప్పు చేయటం హత్యాపరాధాలికన్నా ఘోరమైన నేరం"

"కానీ ఆమె నా స్నేహితురాలు"

"కావచ్చు కానీ స్నేహితులని వదిలించుకో టానికి అప్పు ఉత్తమమైన సాధనం అన్నారు"

"అవుతే ఆపదలో ఆదుకోలేని స్నేహితులెందుకు నాన్నా? కులాసాగావున్న రోజుల్లో మన ఇంటికి వచ్చి కాఫీలు త్రాగపోవటానికా?"

రామనాథం నవ్వలేదు గంభీరంగా "అలానే కనిపిస్తోందమ్మా" అన్నాడు

"మిసెస్‌రావు అలాంటిది కాదునాన్నా నేనడిగితే తప్పకుండా యిస్తుంది నేనంటే ఆవిడకి చాలా ఇష్టంనాన్నా

"నా మాటవిను లీలా నేనే ఎక్కడేనా చూస్తాను నువ్వు మిసెస్‌రావుని మటుకు అడగవద్దు" అన్నాడు

రెండు క్షణాలు సందిగ్ధంగా నుంచుంది లీల "పోనీ యీ రిస్టువాచీని అమ్మేస్తేనో?" అంది

"లీలా!" కోపంగా అరిచాడు రామనాథం "పిచ్చి పనులు చెయ్యక ఆమె ఏమనుకుంటుంది? మన దరిద్రాన్ని చాటి చెప్పుకొందుకి ఆ పని ఒకటే చాలు నీకెందుకూ నువ్వూరుకో నేను ప్రయత్నిస్తాగా" అన్నాడు

తలవంచుకొంది లీల తండ్రికి అంతకోపం రావటం ఆమె ఏనాడూ చూడలేదు మిసెస్ రావుని ఎందుకడగ కూడదో అసలామెకి బోధపడ లేదు పోతే శ్యామల! శ్యామల మటుకు ఎక్కడ నుండి తేగలదు? అడిగి పరువు పోగొట్టుకోవటం తప్పనిస్తే బాధంతా లోనికి దిగమ్రింగు కొని వంటింటివేపు దారితీసింది లీల

మళ్లీ రెండు రోజులు గడిచాయి రామనాథం స్థితిలో మార్పేమీ లేదు కన్నవారినల్లా అప్పు అడిగి రాత్రి ఎదింటికి ఇంటికి చేరుకొన్నాడు ఆలస్యానికి కారణం అడిగిన లీలపై విసుక్కు న్నాడు రాత్రంతా కంటిమీద కునుకు లేదు రామ నాథానికి పరిస్థితు లెందు కిలా వక్రిస్తున్నాయో, తననింత తీవ్రంగా దురదృష్టదేవత ఎందుకు వెంటాడుతోందో అర్థంకావటం లేదు ఈ విషమ పరిస్థితులన్నీ తన నేదో బలవత్తరమైన నిర్ణయం తీసుకునేందుకు, ఏ పనియైతే చెయ్యకూడదని మనసా, వాచా కర్మా ప్రయత్నిస్తున్నాడో ఆ పని చేయించేందుకు, తన ఆత్మాభిమానాన్ని ముక్కలు ముక్కలుగా తరిగెయ్యటానికి సిద్ధమైన విధి అనే భయంకర ఖడ్గంగా వూహించుకొని వణికి పోయాడు రామనాదం

ఉదయం లీల కాలేజికి వెళ్లలేదు కారణం తెలిసినా అడక్కుండా వుండలేకపోయాడు అటెం డెన్సు రిజిష్టర్లో అప్పుడే పేరు కొట్టేశారేమోనని అనుమానం వేసింది అందుచేత అడక్క తప్పలేదు

"కాలేజి మానేద్దామనుకుంటున్నాను నాన్నా" అంది లీల


"లీలా!"

"అవునాన్నా మన ఆర్థిక పరిస్థితులు బాగు లేనపుడు మరేం చేస్తాం? పైగా నేను చదివి సాధించే దేమిటో అర్థంకావటం లేదు ఉద్యోగా లంటూ చెయ్యాలేను నీకిష్టంలేదు నాకు అలాంటి తలంపూలేదు మరెందుకు నాన్నా చదవటం?"

ఒక నిమేషకాలం నిరుత్తరుడై నుంచుండి పోయాడు రామనాథం ఎంత బాధపడి ఆ పసి హృదయం అలాంటి నిర్ణయానికి వచ్చివుంటుందో వూహించుకోవటం తేలిక కాదు రెండో ఏడు చదువుతూ మధ్యలో ఆపెయ్యటమూ సమంజస మైన కార్యం కాదు లీల ఉద్యోగాలు చేసి తన నుద్ధ రించాలనే తలంపు తనకేనాటికీ లేకపోవచ్చు కాని చదువు అందుకోసమే కాదుగా విజ్ఞత పెరిగితే విశాల దృక్పథంతో జీవితాన్ని వీక్షించగలదు కష్ట సుఖాలని నిర్లిప్తంగా స్వీకరించగలదు ఆ మాటే అన్నాడు లీలతో చదువు మానేద్దామన్న తలంపు ఎప్పుడూ పెట్టుకోవద్దన్నాడు లీల అంతా విన్నది కానీ ఆమెకు చెబుతంటే తనకే తనమాటల్లో ఏదో వెలితి అగుపించింది తను మాటలు చెప్పాడే కాని, పరిస్థితుల కేదేనా పరిష్కార మార్గం చూపాడా?

పోస్టుమ్యాన్ రావటంతో రామనాథం దృష్టి మళ్లింది కవరు తీశాడు పెళ్లి చూపులకి వచ్చిన వారి దగ్గర నుండి ఆరువేల రూపాయలు కట్నం కావాలిట! ఇస్తే చేసుకోటానికి ఎలాంటి అభ్యం తరమూ లేదని సారాంశం భగభగా మండిపోయింది అతని హృదయం అమ్మాయి అందంగా అప్సరసలా వుండాలి, చదువు సంధ్యలుండాలి, పైగా కట్నం కావాలి! ఆవేశంగా ముక్కలు చేశాడు ఆ ఉత్త రాన్ని కిటికీలోంచి ఎగిరిపోతున్న కాగితం ముక్కలు తన ఆశల్లా అగుపించాయి ఆ దృశ్యాన్ని వీక్షించిన లీల తలవంచుకొని లోపలికి వెళ్ళిపోయింది

ఆపూట ఆఫీసుకు వెళ్లలేదు రామనాథం సెలవు చీటీ కూడా పంపలేదు ప్రపంచం మీద అంతులేని రోత కలిగింది అవకాశం దొరికితే కన్న బిడ్డ వారినల్లా చిత్రవధచేసి వదలాలని ఎంచింది ఆవేదనంతా చల్లబడాక తన మీద తనకే అసహ్యం వెయ్యసాగింది ఏమిటి సాధించాడు తను జీవి



లంతో? తను అడుగడుగూ తప్పటడుగులా ధ్వని స్తోంది పెద్ద ఉద్యోగంచేసి అమ్మని సంతోష పరచాలన్న తలంపు ఆదిలోనే వమ్మైంది ఉన్న ఉద్యోగంలో సంతృప్తిగా సంసారిక జీవితాన్ని నెట్టుకు రావాలన్న తలంపు తనమీదికే తిరగబడింది ఏవో ఆశయాలంటూ ఇవతలికి వచ్చి లీల జీవితాన్ని సరిదిద్దుతామన్న తలంపులు యిలా పరిణమిస్తున్నాయి! ఇందుకు కారణం ఏమిటి? తన వ్యూహాలన్నీ తల్రక్రిందులు కావటానికి ఆలవాలమైన ఆ లోటు ఎక్కడుంది? తన మొండితనమా? వసుంధర అన్నట్లు తరగని తన ఆత్మాభిమానమా? జీవితాన్ని గురించి తను అల్లుకొన్న వ్యూహాలన్నీ తప్పులతడకలేనా? డబ్బు ముందు ఆ వ్యూహాలన్నీ పనికిరావా? తన ఇన్నేళ్ల జీవితపోరాటం ఈ 'డబ్బు' ముందు తలఒగ్గక తప్పదా?

ఇంటిముందు వేగంగా కారు వచ్చి ఆగింది వసుంధర కంగారుగా లోపలికి వచ్చింది రామనాథం లేచి నుంచున్నాడు

"ఏమండీ ఇలాంటి అవకాశం మరోటి రాదు దయచేసి ఈ మాటైనా నా మాట వినరూ?" వసుంధర ఆయాసపడుతోంది

"నెమ్మది వసూ లోపల లీల వుంది"

"వుంటే వుండనివ్వండి ఎన్నాళ్లని మనిద్దరం ఒకప్పటి భార్యాభర్తలని దాని ముందు దాచివుంచగలం ఈ మాటూ మీరు మొండితనమే చూపారంటే నేను దాని తల్లినని లీలకు నేనే చెబుతాను"

"ఇంతకీ నువ్వనే దేమిటి?"

"ఐ ఏ ఎస్ పాసయిన అబ్బాయి ఒకతను వున్నాడు లీల ఫోటో అతనికి చూపించాను నచ్చిందన్నాడు లీలని అతనికి చూపెడతాను నచ్చిందంటే వివాహం చెయ్యవచ్చు"

రామనాథం మాట్లాడలేదు

"కట్నం గురించి మీరు వ్యథనొందనక్కర్లేదు నా దగ్గిర ఇంత డబ్బు వుంది తగలెట్టుకోనా? ఏమండీ ఆలోచించండి నా మీద కోపంతో దాని బ్రతుకును నాశనం చెయ్యవద్దు మిమ్మల్ని ప్రార్థిస్తున్నాను ప్లీజ్!"

రామనాథం నిరుత్తరుడై నుంచున్నాడు అతని మనసులో ఒక తులాదండం ప్రత్యక్షమైంది ఒక వేపు తన ఉద్దేశాలు, మరోవేపు లీల భవిష్యత్!

# నిర్ణయాలూ నిర్బంధాలూ

ఎటు ఎటువేపు మ్రొగ్గాలి? వసుంధర బ్రతిమాలుతోంది ఆత్మ అంగీకరించటంలేదు మేధ మాత్రం ఇలాంటి అవకాశం జారవిడుచుకోవటం తెలివిహీనత అంటోంది లీల కాలేజీ మానేస్తాననటం, ఆ అనటంలో కంఠంలోని దీనత్వం, తను చించేసిన ఉత్తరం కాగితం ముక్కలు మనసులో ప్రత్యక్షమై వికట అట్టహాసం చెయ్యసాగాయి హఠాత్తుగా వో నిర్ణయానికి వచ్చాడు రామనాథం

"అమ్మా లీలా" అన్నాడు

"ఇక్కడే వున్నాను నాన్నా"

రామనాథం వెనుదిరిగి చూశాడు వంటింటి తలుపుని అంటిపెట్టుకొని నుంచొని వుంది లీల ఆమె ముఖకవళికలు చూడగానే జరిగిన తతంగాన్నంతా ఆమె వీక్షించిందని అర్థమైంది అదీ ఒకందుకు మేలే అనిపించింది!

మొహం ప్రక్కకు త్రిప్పుకొని "మిసెస్‌రావు ఎవరో కాదమ్మా నీ తల్లే వెళ్లమ్మా ఇవాళ మీ అమ్మతో వెళ్లిపో" అతని కంఠం బొంగురుపోయింది

లీల నిశ్చలంగా నుంచుని వుంది

వసుంధరలో ఆనందం ప్రస్ఫుటమైంది రామనాథం అంత తొందరగా అంగీకరిస్తాడని ఆమె అనుకోలేదు లీలని ఉద్దేశిస్తూ అప్యాయంగా మాట్లాడిందామె గొక్కి పట్టిన మాతృత్వం ఒక్కసారి పెల్లుబికింది జరిగిన కథనంతా టూకీగా చెబుతూ, లీలని కౌగలించుకొని రోదించిందామె

లీల నిశ్చలత్వంలో మార్పులేదు

రామనాథం కొద్దిగా తేరుకొని, తల పైకెత్తాడు "నా గురించి నీకు విచారం వద్దమ్మా నేను ఎక్కడైనా సుఖంగా వుంటాను నా భయమల్లా నీ భవిష్యత్తుని గురించే నీ సుఖాన్నే నేను, వసుంధరా కోరుతున్నాము వెళ్లమ్మా! ఇవాళదాకా నాతో వున్నావు నేడు నేనే మీ అమ్మతో వెళ్లమని చెబుతున్నాను నాకన్నా, నీ భవిష్యత్‌ని మీ అమ్మ చక్కగా దిద్ది తీర్చగలదన్న నమ్మకం నాకుంది" అన్నాడు

లీల నిశ్చలత్వం చెదరలేదు స్థాణువులా నుంచుని వుందామె. ఆమె మౌనం వసుంధరని బాధించింది

"ఏమమ్మా లీలా" అంది

"నన్ను క్షమించండి మిసెస్‌రావ్!"

"లీలా నేను నీ తల్లినమ్మా"

"కావచ్చు నాకు మటుకు మీరు మిసెస్‌రావుగారే సహృదయులైన ఒక మిత్రురాలిగా మీరు నా మనః ఫలకంలో నిలుస్తారే కాని, ఎన్నాళ్టికీ మీరు మాతృస్థానాన్ని సంపాదించుకోలేరు ఈ రోజు నాన్న నుండి నన్ను విడదీస్తూ ఆ గౌరవం కూడ పోగొట్టుకుంటున్నారు మీలా నేను అవకాశవాదిలా మారలేను"

"అవకాశవాదా?"

"నిస్సందేహంగా! ఒక రోజు మీ సుఖంకోసం నాన్న నొదిలి పోయారు ఇవాళ నా మీద ప్రేమ చేత నన్ను ఆయన్నుండి విడదీయ ప్రయత్నిస్తున్నారు నన్ను పెంచి పెద్ద జేసిన నాన్నని నా సౌఖ్యంకోసం ఈనాడు ఏకాకిని చేసి వదలిపోయే మూర్ఖత్వం నాలో లేదు నాన్న మనస్సు ప్రస్తుత పరిస్థితులవల్ల కలతబారి వుండవచ్చు నేను కాలేజీకి పోకపోవటం, నా వివాహ విషయం ఆయనను ఈ నిర్ణయం తీసుకొందుకు నిర్బంధించి వుండవచ్చు కానీ నాకే ఆశలు లేవు నా పెళ్లి ఏ గుమాస్తాతోనైనా ఫరవాలేదు నన్ను, నాన్నని ప్రేమపూర్వకంగా చూసుకునే ఏ అమృతమూర్తి, దరిద్రుడైనా, హోదా, అంతస్తూ లేనివాడైనా ఫరవాలేదు అలాంటి దయామయుడు, విశాల హృదయుడు ఎదుర్పడేదాకా నా వివాహానికి ఏ తొందర లేదు అందని మ్రానిపండ్లకోసం అఱ్ఱులు చాచే స్వభావం, అందుకోసం ఆత్మని చంపుకొని మరొకరిని దేహీ యనటం నాకు రుచించదు అతి సామాన్య జీవితమే నాకు చాలు అందులోనే తృప్తిని వెతుక్కోగలను నేను కష్టమేనా, సుఖమేనా నాన్నతోనే పాలు పంచుకొంటాను ఇది నా నిర్ణయం ఈ నిర్ణయాన్ని ఎవరూ మార్చలేరు ఇదుగో మీరు ఇచ్చిన రిస్టువాచి ఇలాంటి పరిస్థితుల్లో దిన్నుంచుకోటానికి సైతం నాకు మనసంగీకరించదు దయచేసి మీరు మరోమాటు ఇటువేపు రాకండి"

"లీలా!" అన్నాడు రామనాథం

"నువ్వూరుకో నాన్నా పరిస్థితులకి తలవంచి ఆత్మగౌరవాన్ని కించపరచుకొనే హీనత్వం మనకి వద్దు కష్టసుఖాలని మనమే ఎదుర్కొందాం మరొకరికి ఇందులో తలదూర్చే అవకాశం యివ్వవద్దు దయచేసి మిసెస్ రావుగారిని వెళ్లిపొమ్మని చెప్పండి" చేతి గడియారాన్ని స్టూలు మీద వుంచి విసవిసా నడిచిపోయింది లీల అటునుండి

నిశ్చేష్టురాలై నుంచుండిపోయింది వసుంధర రామనాథం కళ్లమ్మట నీటి బిందువులు జలజలా రాలాయి అవి ఆనంద బాష్పాలో దుఃఖాశ్రువులో ఆయనకే తెలీలేదు వసుంధర ఒక క్షణం రామనాథంవంక చూసింది ఆమె నయనాలు చెమ్మగిల్లి వున్నాయి నెమ్మదిగా స్టూలుమీది రిస్టువాచి అందుకొంది భారంగా అడుగులు వేస్తూ బయటికి నడిచింది రామనాథం పైపంచతో బుగ్గల మీది కన్నీటిని తుడుచుకుంటూ వుండిపోయాడు ●

